క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ రాజారెడ్డి

ఓర్వకల్లు: మండల ఎస్‌ఐగా రాజారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునను కర్నూలు ఫ్యాక్షన్ జోన్ విభాగానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కోసిగిలో పనిచేస్తున్న ఎస్‌ఐ రాజారెడ్డిని ఓర్వకల్లు ఎస్‌ఐగా నియమించారు. ఆ మేరకు ఎస్‌ఐ మల్లికార్జున తమ బాధ్యతలను రాజారెడ్డికి అప్పగించారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడున్న సీపీఎం కార్యదర్శి మోహన్

గూడూరు: గూడూరు మండలాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జే.మోహన్ కోరారు. సీపీఎం జీపు జాతలో భాగంగా బుధవారం వారు మండల వ్యాప్తంగా పర్యటించారు. గూడూరు పాత బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతూ.. మండలంలో రహదారులు సక్రమంగా లేవని, తాగడానికి మంచి నీరు కూడా లేవని వాపోయారు. గూడూరును నగర పంచాయతీగా మార్పు చేసి కూలీలకు ఉపాధి హామీ పథకం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేసారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు. నాయకులు రాజశేఖర్, వెంకటేశ్వర్లు, దానమన్న, ఈరన్న, గిడ్డయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం నిరసన

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామ సమీపంలో నిర్మించిన జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన వారికి పరిహారం అందించకపోవడంతో బుధవారం ఫ్యాక్టరీలోని మైనింగ్ ప్రాంతం వద్ద బాధిత రైతు కుటుంబసభ్యులతో ఆందోళన నిర్వహించారు. బిలకలగూడూరు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా, వెంకటసుబ్బయ్య, బాలనాగన్న, ఆనందం, చిన్న సుబ్బన్నలకు చెందిన పొలాన్ని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ కోసం తీసుకున్నారు. మైనింగ్ వద్ద కుటుంబసభ్యులతో కలిసి రహదారికి రాళ్లను అడ్డం పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. కొన్ని ఏళ్ల నుంచి తిరుగుతున్నా పరిహారం ఇవ్వలేదని వాపోయారు. పరిహారం ఇచ్చేంతవరకు ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు.

హుండీ ఆదాయం


రూ. 27 లక్షలు



కె.నాగలాపురంలో హుండీ కానుకలను లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులా పరమేశ్వరీదేవి ఆలయంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపును ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలుకు చెందిన లలిత సుందరేశ్వరి సంఘం, శంకరవాణి సేవా సమితికి చెందిన 67 మంది మహిళలు స్వచ్ఛందంగా లెక్కింపులో పాల్గొన్నారు. ఆలయంలోని నాలుగు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.27,16,842 ఆదాయం వచ్చిందని, ఈ సొమ్మును ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు ఈఓ రాధాకృష్ణ తెలిపారు. తనిఖీ అధికారి హనుమంతరావు, ఎస్‌ఐ సోమ్లానాయక్ పాల్గొన్నారు.

ఐదు ఇళ్లలో చోరీ



బీరువా పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడేసిన దృశ్యం

గడివేముల: మంచాలకట్ట గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి ఐదు ఇళ్లలో చోరీ జరిగింది. గ్రామస్తులు బిడుగు నారాయణ, దాసు, రత్నమ్మ వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స నిమిత్తం కర్నూలుకు వెళ్లారు. ఇళ్లలో ఎవరూ లేని విషయం గుర్తించిన దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి.. నారాయణ ఇంట్లో రూ.30 వేల నగదు, మూడు తులాల బంగారం, దాసు ఇంట్లో రూ.2 లక్షలతో పాటు 3 తులాల బంగారం, రత్నమ్మ ఇంట్లో తులం బంగారం చోరీ చేశారు. అలాగే రామదాసు, జంబులయ్య ఇళ్లలో వస్తువులను దోచుకున్నారు. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు గడివేముల ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. నంద్యాల క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. చోరీ జరిగిన ఇంటి వద్ద కత్తులు లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది.

కౌలు పత్రం.. సాగు భద్రం

- పంట సాగు హక్కు పత్రాలు పంపిణీకి సిద్ధం
- భూ యజమాని తరహాలోనే పథకాలు వర్తింపు
- నంద్యాల జిల్లాలో ఇప్పటివరకూ 12,110 కార్డులు మంజూరు
- ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ



కరిమద్దెల గ్రామానికి చెందిన రైతుకు మంజూరైన సీసీఆర్ కార్డు

గడివేముల: రైతులకే కాదు.. కౌలుదారులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పిల్లల చదువుల కోసం వలస వెళ్లిన వారు. వయస్సు మీద పడి వ్యవసాయం చేయలేని వారు, వ్యాపారాలు, ఉద్యోగాలు, ఇతర ఉపాధి మార్గాలను ఎంచుకున్న మరి కొందరు పొలాలను కౌలుకు ఇస్తుంటారు. భూ యజమానుల నుంచి కౌలుకు (గుత్తకు) భూమి తీసుకుని సాగు చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతుల సంఖ్య అధికమవుతోంది. గతంలో భూ యజమానులకు తప్ప కౌలు రైతులకు ఎలాంటి ప్రభుత్వ ప్రయోజనాలు చేకూరేవి కావు. వీరి కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కౌలు రైతులకు అండగా నిలుస్తోంది. భూ యజమానుల మాదిరిగానే పంట రుణాలు, బీమా సదుపాయం, విత్తనాలు, వ్యవసాయ పరికరాల పంపిణీలో సబ్సిడీ, పంటనష్ట పరిహారం వంటివి అందజేసేలా చర్యలు తీసుకుంది. కౌలు కార్డులు పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు ఆయా గ్రామాల్లోని వీఆర్వోలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

యాజమాన్య హక్కులకు ముప్పు ఉండదు

కౌలు కార్డుల విషయంలో కొందరు భూజమానులు తమ హక్కులకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. వారి అపోహలు వాస్తవం కాదని అధికారులు చెబుతున్నారు. కేవలం 11 నెలల కాల పరిమితితో జారీ చేసే కార్డులతో ఎటువంటి ఇబ్బందులు ఉండవని భూ యాజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. రెవెన్యూ, వ్యవసాయశాధికారులు కలిసి నిజమైన కౌలుదారులను గుర్తిస్తున్నారు. కౌలురైతులు సాగు చేస్తున్న భూమి వివరాలు, ఆధార్, వీఆర్వో, వీఏఏ అందజేసే ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే అర్హత ఆధారంగా కౌలు కార్డులు మంజూరు చేస్తున్నారు.

సీసీఆర్ పత్రాలు అందజేత

కౌలుదారులకు మేలు చేకూరేలా ప్రభుత్వం పంట సాగు హక్కు పత్రం అందజేస్తోంది. దీనినే క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్ (సీసీఆర్‌సీ) అని వ్యవహరిస్తున్నారు. ఈ పత్రాల ద్వారా కౌలుకు వ్యవసాయం చేసే రైతులకు వివిధ రకాలుగా లబ్ధి చేకూర్చేందుకు పథకాలను రూపొందించింది. ఇందుకోసం ఏపీ పంట సాగు హక్కు చట్టం -2019 రూపొందించింది. సెక్షన్ 3 (2), 8 (ఏ) ప్రకారం 11 నెలల కాల పరిమితికి పంట సాగు హక్కు పత్రాలను అందిస్తోంది. వీటి ద్వారా కౌలుదారులకు పథకాలు, రాయితీలు వర్తిస్తాయి. ప్రస్తుతం గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో కౌలుదారులకు సీసీఆర్ కార్డులు పంపిణీ చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 408 ఆర్బీకేలు ఉన్నాయి. ప్రభుత్వం 21,465 మందికి కౌలు కార్డులు అందించేందుకు లక్ష్యం పెట్టుకుంది. ఇందులో ఇప్పటివరకు 12,110 మందికి సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయడంతో మిగతా 9,355 మంది దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారులు, రెవెన్యూ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



పొలం దున్నుతున్న కౌలు రైతన్న

కౌలు కార్డుతో బోలెడు ప్రయోజనాలు

- వైఎస్సార్ యంత్రసేవ పథకం ద్వారా ట్రాక్టర్లు, యంత్రాలు, వ్యవసాయ పరికరాలు పొందడానికి ఉపయోగపడుతుంది.
- రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు రైతు భరోసా పథకం కింద లబ్ధి కలుగుతుంది. వరి పంట సాగు అయితే కచ్చితంగా ఎకరం ఉండాలి.
- పంట నష్టపోయిన సందర్భంలో వాతావరణ ఆధారిత, దిగుబడి ఆధారంగా లెక్కించి పంట వైఎస్సార్ బీమా పథకం ద్వారా పరిహారం అందిస్తారు.
- ప్రభుత్వం నిర్దేశించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు, సొసైటీల ద్వారా పంట రుణాలు పొందే అవకాశం ఉంటుంది.
- రూ.లక్ష లోపు తీసుకున్న పంట రుణాలకు సున్నా వడ్డీ వర్తింపజేస్తున్నారు.
- వ్యవసాయ శాఖ ద్వారా అందించే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతర ఇన్‌పుట్ సబ్సిడీలు పొందే హక్కు ఉంటుంది.
- ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు వీలుంటుంది.
- పంట రుణాలకు రైతు చెల్లించాల్సిన మూడు శాతం వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. కౌలుదారులకు కూడా దీనిని వర్తింపజేస్తున్నారు.

నంద్యాల జిల్లాలో మండలాల వారీగా సీసీఆర్‌సీ కార్డుల వివరాలు

మండలం	లక్ష్యం	అందించినవి	శాతం
సంజామల	1,174	363	31
చాగలమర్రి	627	243	39
బేతంచెర్ల	349	137	39
పగిడ్యాల	722	284	39
రుద్రవరం	712	298	42
అవుకు	537	234	44
గడివేముల	1,381	613	44
బనగానపల్లె	1,396	632	45
బండిఆత్మకూరు	720	343	48
జూపాడుబంగ్లా	702	336	48
మహానంది	891	431	48
కోవెలకుంట్ల	891	439	49
అళ్లగడ్డ	446	229	51
శిరివెళ్ల	974	517	53
పాణ్యం	968	521	54
కొత్తపల్లి	271	147	54
దొర్నిపాడు	1,390	905	65
ప్యాపిలి	403	244	61
మిడ్తూరు	805	523	65
గోస్పాడు	1,390	905	65
కొలిమిగుండ్ల	105	73	70
నంద్యాల	1,007	701	70
డోన్	165	118	72
ఆత్మకూరు	861	671	78
ఉయ్యాలవాడ	1,318	1047	79
వెలుగోడు	374	317	85
నందికొట్కూరు	998	847	85
పాములపాడు	493	430	87

సీసీఆర్ కార్డుతో ప్రయోజనాలు



కౌలుదారులు కచ్చితంగా సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలి. తద్వారా ప్రభుత్వం నుంచి అన్ని రకాలు రాయితీలు, పథకాల లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ప్రధానంగా పంట రుణాలు వైఎస్సార్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ పొందవచ్చు. వ్యవసాయ పరికరాలు సబ్సిడీ పై పొలదవచ్చు. సీసీఆర్‌సీ కార్డు కోసం గ్రామ వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి దరఖాస్తులు తీసుకోవాలి. అర్హులైన కౌలు రైతులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసకోవాలి.

– మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

ఆపద వేళ అండగా ఉన్నారు



సి.బెళగల్‌లో అనారోగ్యానికి గురైన వెంకమ్మకు ఆశావర్కర్ ఉసేన్‌బీతో కలిసి మందులు అందిస్తున్న వలంటీర్ జయలక్ష్మి

స్థానిక గ్రామ సచివాలయం-2 పరిధిలో అల్లం వెంకమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆరోగ్య సమస్యలకు తోడు వృద్ధాప్యంతో కాలుబయట పెట్టలేని ధీనస్థితిలో ఉంది. ఆ క్లస్టర్ వలంటీర్‌గా ఉన్న జయలక్ష్మి మంచాన పడ్డ వెంకమ్మను రోజూ పరామర్శిస్తూ ఆరోగ్య వివరాలు తెలుసుకునేది. కరోనా కష్టకాలంలోనూ ఉదయాన్నే వృద్ధురాలి ఇంటికి వెళ్లి పింఛన్ నగదును చేతికి అందించింది. ఆశా వర్కర్ ఉసేన్‌బీ, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ప్రతినెలా వృద్ధురాలికి అవసరమైన మందులను ఇప్పిస్తూ ప్రజల మన్ననలు పొందింది.

–సి.బెళగల్

మా అమ్మకు తోడుగా ఉంటోంది



మేము బతుకుదెరువు కోసం ఊరు విడిచి వెళ్లాం. వృద్ధురాలైన మా అమ్మకు ఆరోగ్యం సరిగాలేదు. ఆమెను చూసుకునేందుకు వీలుకావడం లేదు. ఈ స్థితిలో మా అమ్మకు నెలనెలా పింఛన్ సొమ్ము ఇవ్వడంతో పాటు మంచిగా పలకరిస్తూ వలంటీర్ జయలక్ష్మి అండగా ఉంటోంది. మేము లేకున్నా మంచాన పడ్డ మా అమ్మకు అవసరమైన మందులను ఆరోగ్య కార్యకర్తలతో కలిసి అందజేస్తూ కుటుంబ సభ్యురాలిలాగా చూసుకుంటోంది. వలంటీర్ జయలక్ష్మి సేవలు ఎప్పటికీ మరువలేం.

– లక్ష్మిదేవి, సి.బెళగల్

సేవలకు సలాం



గార్గేయపురంలో దివ్యాంగుడు షేక్ సైఫుద్దీన్‌కు మందులు అందజేస్తున్న వలంటీర్ ముర్తుజాబేగ్

కర్నూలు మండలం గార్గేయపురం బీసీ కాలనీలో దివ్యాంగుడు షేక్ సైపుద్దీన్ 40 ఏళ్లుగా అనాథగా జీవిస్తున్నారు. కరోనా విపత్కర సమయంలో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితిలో ఆకలితో అలమటిస్తున్న ఈయనకు ఆ క్లస్టర్ వలంటీర్ ముర్తుజాబేగ్ అన్నం పెట్టి ఆకలి తీర్చారు. వలంటీర్ వేలిముద్రతో రేషన్ సరుకులు అందజేస్తూ అక్కున చేర్చుకున్నారు. అవసరమైన మందులు తీసుకొచ్చి అందిస్తూ కుటుంబ సభ్యుడిలాగా చూసుకున్నారు. దీంతో పాటు దివ్యాంగ పింఛన్ రూ.3 వేలు అందజేస్తూ అండగా నిలిచారు. –కర్నూలు (న్యూటౌన్)

ప్రాణాలతో బయటపడ్డాను

వలంటీర్ ముర్తుజాబేగ్ కరోనా కష్టకాలంలో అన్నం పెట్టి కడుపు నింపారు. పింఛన్ అందజేసి, మందులిచ్చి, కరోనా వ్యాక్సిన్ వేయించడంతో ప్రాణాలతో బయటపడ్డాను. వలంటీర్ అందించిన సేవలు నా జీవితంలో ఎప్పుడూ మర్చిపోను. వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి అనాథలు, వృద్ధులకు సేవలందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటా.

– షేక్ సైపుద్దీన్, గార్గేయపురం గ్రామం

23న సింహద్వార ప్రారంభోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు: కోడుమూరులోని పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా ఈనెల 23వ తేదీన సింహద్వారాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణంలో ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సింహద్వార ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సినీ నటుడు సుమన్, దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

జగనన్న సురక్షతో సత్వరం ధ్రువపత్రాలు



పోలకల్ గ్రామంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, వారికి మంచి చేయాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం సి.బెళగల్ మండల పరిధిలోని పోలకల్, గుండ్రేవుల గ్రామాల్లో సచివాలయాల ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బొంతల మునెప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ సేవలను పేదల ఇళ్ల వద్దకు చేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను గుర్తించి ప్రజలు సీఎం జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారిణి శ్యామల, తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఎస్‌ఐ పీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

538 మందికి ధ్రువీకరణ పత్రాలు

సురక్ష కార్యక్రమంలో భాగంగా పోలకల్ గ్రామంలో 303 మందికి, గుండ్రేవులలో 235 మందికి మొత్తం 538 మంది లబ్ధిదారులకు బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. పోలకల్ – 3 గ్రామ సచివాలయంలో నరేష్ అనే యువకుడికి ఎంపీపీ బొంతల మునెప్ప మండల, అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి రైస్‌కార్డు స్ప్లిట్ ధ్రువపత్రం అందజేశారు.

గూడూరు: రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. పట్టణంలో బుధవారం సచివాలయం-6 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్-2 బోయ లక్ష్మన్న, సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు ప్రభుత్వ సేవలను వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ 6వ సచివాలయం పరిధిలో 660 మంది వివిధ సేవల కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని పరిష్కరించినట్లు పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతులమీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. తహసీల్దార్ శివశంకర్ నాయక్, వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జే.ఆబేలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు వచ్చింది



గత ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డు కోసం అధికారుల చుట్టూ ఎన్నో రోజులు తిరిగాను. అయినా రాలేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో అధికారులే ఇంటికి వచ్చి వివరాలు రాసుకొని వెళ్లారు. వారు అడిగిన ధ్రువపత్రాలు అందజేశాను. వారం రోజుల్లోనే రేషన్ కార్డు వచ్చింది. కార్డు ఇంత త్వరగా వచ్చిందటే సీఎం జగనన్న చలువే. – అనిత, గూడూరు

పిల్లలను బడిలో చేర్పించండి



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి అమరనాథ్ రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలలో గుర్తించిన బడి ఈడు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి అమరనాథ్‌రెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి బడి ఈడు పిల్లలు ఎంత మందిని గుర్తించారు? వారందరిని ఆగస్టు నెలాఖరులోగా పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్‌ను ఆదేశించారు. అలాగే నాడు – నేడు పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ రామయ్యను ఆదేశించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, వివిధ శాఖల ఇంజనీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి



కొంగనపాడు గ్రామంలో ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొంగనపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కారాదన్నదే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ఎంపీడీఓ జీవీ రమణ మూర్తి, డీటీ గిరికుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కేశవరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ సువర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉలిందకొండ గ్రామంలో నాయకులు రమణారెడ్డి, రమణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. సర్పంచ్ సుంకులమ్మ, గ్రామ నాయకులు శ్రీనివాసులు, శీనయ్య, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లోనే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్



దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వచ్చింది. మా నాన్న రామిరెడ్డి మరణించి నెల రోజులైంది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉచితంగా అందిస్తారని చెప్పి వలంటీర్ దరఖాస్తు చేయించాడు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా వెంటనే సర్టిఫికెట్ వచ్చింది. గ్రామ సచివాలయం దగ్గరకే అధికారులు వచ్చి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించడం గొప్ప విషయం. – మహేశ్వర్‌రెడ్డి, కొంగనపాడు

ఇక నుంచి పథకాలు వర్తిస్తాయి



నేను రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్నాను. గతంలో పంట నష్ట పోయినప్పుడు పరిహారం అందక చాలా ఇబ్బందులు పడ్డాను. కౌలు కార్డు ఉంటే ప్రభుత్వం అందించే రైతు భరోసా, పంట నష్ట పరిహారం, సబ్సిడి విత్తనాలు, ఎరువులు వంటివి అందుతాయని అధికారులు తెలిపారు. సురక్ష కార్యక్రమం ద్వారా కౌలు హక్కు పత్రం పొందాను. ఇకపై యాజమాన్య రైతులతో సమానంగా పథకాలు అందుకుంటాను. – టి.మధు, కొంగనపాడు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, సచివాలయ ఉద్యోగులు పని చేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ రాముడుతో కలిసి స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో విద్యాశాఖ, హౌసింగ్, ఉపాధిహామీ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాల నిర్వహణపై అధికారులతో చర్చించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల అనుమతులు రద్దు చేయాలని, ఈ విషయం తెలియజేసి గృహ నిర్మాణాలలో పురోగతి ఉండేలా చూడాలని హౌసింగ్ ఏఈ సుమంత్, సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి కూలీలకు వేతనాల సమస్యలు లేకుండా చూడాలని, అడిగిన వారందరికీ పనులను కల్పించాలని ఏపీఓ లక్ష్మన్న, ఈసీ వృద్ధి, టీఏలతో అన్నారు. బడి బయటి విద్యార్థుల సర్వే, విద్యా సంక్షేమ పథకాల అమలు, లబ్ధి వివరాలను ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సంక్షేమ సహాయకులు ఉన్నారు.

ప్రింటర్ విరాళం

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ధనిరెడ్డి రుద్రకేశవరెడ్డి (ఎన్ఆర్ఐ) రూ.35 వేలు విలువచేసే ప్రింటర్‌ను బుధవారం బహుకరించారు. వైర్‌లెస్ ప్రింటర్‌ను అందించినట్లు ఉపాధ్యాయుడు నాగేశ్వరరెడ్డి తెలిపారు. దాతకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సమావేశం

గూడూరు: కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివశంకర్‌నాయక్ తెలిపారు. కర్నూలు ఆర్డీఓ వెంకటేశం హాజరవుతారని,రాజకీయ పార్టీల నాయకులు హాజరై సూచనలు ఇవ్వవచ్చన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్‌సీ ఏడీఏ వేదమణి

కోడుమూరు రూరల్: కోడుమూరులోని విత్తనాల దుకాణాల్లో డీఆర్‌సీ ఏడీఏ వేదమణి, ఏఓలు రవిప్రకాష్, హేమలత బుధవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాలకు సంబంధించి సరిన్ల రికార్డులు చూపని కిసాన్‌మాల్, రాఘవేంద్ర, శ్రీరామ, రామలింగేశ్వర దుకాణాల్లో రూ.22 లక్షలు విలువ చేసే విత్తన అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు విత్తనాలు, ఎరువులు, మందులకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్లతో పాటు, రికార్డులను కలిగిఉండాలన్నారు. దుకాణాల్లో విక్రయించే ప్రతి వాటికి రికార్డులుండాలని, అలా చూపకపోతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

అనుమతులున్న విత్తనాలనే అమ్మాలి

సి.బెళగల్: ప్రభుత్వ అనుమతులున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు ఎంఆర్పీకే విక్రయించాలని ఏఓ మల్లేష్‌కుమార్ ఆదేశించారు. ఆయన బుధవారం సి.బెళగల్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిషేధిత మందులు, నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలుదారులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, ధరలు, నిల్వల బోర్డులను ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. మందులు, విత్తనాల శ్యాంపిల్స్ తీసుకుని పరీక్షల నిమిత్తం విజయవాడ ల్యాబ్‌కు పంపారు. ఎంపీఈఓలు, వీఏఏస్‌లు వెంట ఉన్నారు.